
సంపుటి: 1 | సంచిక: 3

మార్చి - ఏప్రిల్, 2013

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్వైమాస పత్రిక



**ఆయన పొందిన దెబ్బల వలన మనకు స్వస్థత కలుగుచున్నది.**



# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

దేవుని యందు ప్రియమైన స్వర్ణ పాఠకులకు ప్రభువు నామములో వందనములు.

లోకములో పరిస్థితులు దినదినము ఎంతో క్లిష్టమైనవిగా మారుచుండగా, ఎక్కడ చూచిన అశాంతి, స్వార్థము రాజ్యమేలుచుండగా, భయం గుప్పిట్లో మనుష్యులు జీవనం కొనసాగించుచున్నారు. క్రీస్తును ఎరిగిన మనం ఆయన ఉచితమైన కృప ద్వారా నెమ్మదిగాను, క్షేమముగాను ఉన్నందుకు దేవునికి లెక్కలేని కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసిన వారమై యున్నాము.

చదువుకుంటున్న పిల్లలకు పరీక్షల సమయం దగ్గర పడుతూ ఉంది. టెన్షన్ టెన్షన్‌గా సిద్ధపడుతున్నారని తలంచుచున్నాను. పరీక్షల కొరకు దేవుడు జ్ఞానము దయచేయవలెనని మనం ప్రార్థన చేయవలెను. అంత మాత్రమే కాకుండా వారు దేవుని సహాయం కోరుకొనునట్లుగా ప్రోత్సహించవలయును. అలాగే వేసవికాలములో మనం ప్రవేశించాము కనుక ఎండ వేడిమి వలన పెద్దలు, వృద్ధులు అయిన వారికి ఎటువంటి ఇబ్బంది, వడదెబ్బలు తగలకుండా ఉండునట్లు ప్రార్థన చేయుదుము.

శరీరములో అవయవములు అనేకమై ఉన్ననూ, ఒకదానితో ఒకటి ఏలాగు కలిసి పని చేయునో అలాగే సంఘము అనే క్రీస్తు శరీరములో అనేకులమైన మనము ఒకరితో ఒకరు కలసి పనిచేయవలెను. సమాధానము అను బంధము చేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుట యందు శ్రద్ధ కలిగి ఉండవలెనని, ప్రేమతో ఒకరిని ఒకరు సహించుకొనవలెనని పౌలు మనకు నేర్పుచూ, దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడుచుకొనవలెనని బ్రతిమాలుచున్నాడు. మనము ఏ విధంగా జీవించవలెను అనుటకు ఆది సంఘము అనగా మొట్టమొదటి సంఘము మనకు మాదిరి అయి ఉన్నది. వారు స్వప్రయోజనముల కంటే అందరి ప్రయోజనము ముఖ్యమని ఎంచిరి. అలాగే శ్రమలలో కూడా అత్యధికమైన సంతోషమును కలిగి వున్నారని మనము గ్రహించగలము.

అలాంటి మనస్సుతో దేవుడు మనలను నడిపించును గాక !

మీ సహోదరుడు.....

సంపుటి: 1 | సంచిక: 3 మార్చి - ఏప్రిల్, 2013

# దేవుని స్పర్శ

ఈ సంచికలో...


- ఉద్ధేశ్యము ........ 2
- కెనడీ ఉజ్జీవం ........ 5
- చెప్పిన మాట వింటే...(స్త్రీల ప్రత్యేకం) ........ 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 27వ భాగము ........ 10
- అనైక్యత (బాలల శీర్షిక) ........ 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 14
- స్వ'పాలన' శాపం ........ 16
- రూపాయి, యూరో, పౌండ్, డాలర్ ........ 18
- ప్రార్ధనా శక్తి ........ 19
- ఎష్కోలు లోయ ........ 21
- బైబిల్ క్విజ్-27 ........ 22


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# ఉద్దేశ్యము

**- బ్రదర్. ఎపప్రా**

దేవుడు మానవుని పట్ల కలిగి ఉన్న ఉద్దేశ్యములను గ్రహించిన యెడల మనకు ఆశ్చర్యం కలుగుతుంది. దేవుని విశ్వసించిన వారి జీవితములలో ఆయన ఇచ్చే అభిషేకం కేవలం మన కొరకు మాత్రమే కాదు కానీ మనుష్యలందరి కొరకు మరియు లోకం అంతటికొరకు. మనం ఇప్పుడు ఎంత చిన్న పనిని చేస్తున్నవారమైనప్పటికి గొప్ప కార్యముల కొరకు దేవుడు మనలను ఉద్దేశించాడు.

ఆదాము మీద అభిషేకం భూలోకం అంతటి కొరకు అయితే అది షరతులతో కూడుకొనినది. ఆనాటి నుండి ప్రభువైన యేసుక్రీస్తు వచ్చేవరకు ఏ మనుష్యుడు సంపూర్ణముగా ఆ కార్యము నెరవేర్చలేకపోయెను. తండ్రియైన దేవుడు క్రీస్తును మనుష్య కుమారుడుగా ఈ లోకానికి పంపడం ద్వారా లోకం అంతటికి ఆశీర్వాదకరముగా ఆయన తన జీవితాన్ని అర్పించడం జరిగింది.

ఇప్పుడు క్రీస్తుయేసు నందు ఉన్నవారికి ఏ శిక్షావిధియు లేదు. ఇప్పుడు సమస్తమును దేవుడు క్రీస్తు ద్వారా మనకు అనుగ్రహించి ఉన్నాడు. మనము కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట తప్ప మరి ఏమి చేయగలం. కొన్నిసార్లు మనం ఇది చేయి, అది చేయి అని దేవునిని అడుగుతూ ఉంటాము. ఆయన మన కొరకు సమస్తమును జరిగించి యున్నాడు. మరల తిరిగి చేయుటకు ఏమియు లేదు, అందుకే ఆయన సిలువలో సమాప్తమైనది అని చెప్పడం జరిగింది. భూలోక మరియు పరలోక ఆశీర్వాదములు మన కొరకు మాత్రమే కాకుండా, పుట్టబోయే వారి కొరకు కూడా ఆయన సిలువ మరణం ద్వారా 2000 సంవత్సరముల క్రితమే పూర్తి చేయడం జరిగింది. మనం గుర్తుంచుకోవలసిన విషయమేదనగా సకల ఆశీర్వాదములు ఆయన చేసిన త్యాగం ద్వారా మనకు సిద్ధపరచబడియున్నవి. విశ్వాసము ద్వారా మనము వాటిని పొందుకొనవలయును.

మన కొరకు ఆయన చేసిన త్యాగము ద్వారా పరలోకపు ఆశీర్వాదములను మనము భూమి మీద అనుభవించగలము. అనారోగ్యము, ఓటమి, కరువు, పాపము, బంధకములు, అనేవి పరలోకములో లేవు అని మనము గ్రహించవలయును.

ఆయన సిలువ ద్వారా మనకు అనుగ్రహించబడిన ఆశీర్వాదములలో ఏడింటిని ధ్యానించుకుందాము

### 1. రక్షణ

రక్షణ అనేది ఉచితమైన బహుమానం. మనుష్యులు ఎలాంటివారు, ఏ ప్రాంతము

అనే భేదము లేకుండా సమస్త జాతి ప్రజల కొరకు ఆయన సిలువలో మరణించాడు అనగా మన పాపముల శిక్ష అనుభవించడం జరిగింది. **దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. (యోహాను 3:16)**

మనము ఆయన నుండి వెనుదిరిగిన వారమైననూ, మరల తిరిగి చేర్చుకోవడానికి సిద్ధమైన తండ్రి మనస్సు కలిగినవాడు. ఆయన మనకు తీర్పు తీర్చుటలేదు కానీ మనలను ప్రేమించి మనలను క్షమించుచున్నాడు. అపవాది యొక్క ఆత్మ విమర్శించి, తీర్పుతీర్చి, దేవుని యొద్ద నుండి పారిపోయేటట్లు మరియు దేవుని యొద్ద అవకాశం లేదు, చనిపోవాలి అన్నట్లు చేస్తుంది. దేవుని ఆత్మ అన్ని వేళలలో చేర్చుకోవడానికి సిద్ధముగా ఉంటుంది.

## 2. స్వీకరించుట

మనము అందరిచేత తృణీకరించబడినా, త్రోసివేయబడినా మన పరలోకపు తండ్రి మనలను స్వీకరించునట్లుగా యేసయ్య సిలువ మరణం మనకు సహాయం చేస్తుంది. **ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదు గాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము – అబ్బా తండ్రీ అని మొఱ్ఱపెట్టుచున్నాము (రోమా 8:15)**

ఆయన మనలను స్వీకరించడం ద్వారా మన అవమానం అంతా తీసివేసి ఆయన తన కుమారులు అని మనలను పిలుచుచూ ఆయన పేరు మనకు అనుగ్రహించారు. శక్తివంతమైన ఆయన కుటుంబ సభ్యులుగా మనలను చేసుకున్నాడు. ఆయన రాజ్యము అంతము లేనిది. ఈ లోకములో రాజులు వస్తారు పోతారు కానీ మన రాజు మన తండ్రి ఎల్లప్పుడూ మనతో ఉంటాడు. ఆయన వలె మనలను స్వీకరించువారు ఎవరూ ఉండరు. నిజముగా ఆయన మనుష్యులను స్వీకరించుచున్న విధానము చూడగా ఆశ్చర్యము కలుగుచున్నది. అట్టి మహా దేవుడు మనకు దేవుడుగా ఉండటం మన భాగ్యము.

## 3. స్వస్థత

అనారోగ్యము మేకులతో సిలువకు కొట్టబడింది. వ్యాధిని మనము గెలిచి ఆరోగ్యముతో జీవించటానికి సిలువలో ఆయన మరణించాడు. **మనము పాపముల విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను. ఆయన పొందిన గాయముల చేత మీరు స్వస్థత నొందితిరి. (1 పేతురు 2:24)**

నవనాగరిక ప్రపంచములో కొందరు క్రైస్తవులు దైవిక స్వస్థతను నమ్మకపోవడం బాధాకరము. ఆయన పొందిన దెబ్బలు మనకు స్వస్థతను కలిగిస్తున్నాయి. ఎవరు దానిని

విశ్వసించెదరో వారు ఎటువంటి వ్యాధిలో నుండి అయినా స్వస్థతను పొందగలరు. అయితే దేవుని స్వస్థతను పొందకుండానే దేవుడు మిమ్ములను స్వస్థపరిచాడు అని చెప్పే కొందరి అబద్ధపు సాక్ష్యములను బట్టి దైవిక స్వస్థత మీద మనము అపనమ్మిక కలిగి ఉండకూడదు. సమాజములో అనేక మోసపూరితమైన ప్రకటనలు ఉన్న విషయం వాస్తవమే. అందుచేత మనము దేవుని స్వస్థత విషయములో సందేహించకూడదు. ఆయన నీ కొరకు స్వస్థత సిద్ధముగా ఉంచితే దానిని పొందుకోవడమే నీవు చేయవలసినది.

### 4. విడుదల

సిలువలో సాతాను యొక్క ప్రతి కార్యము నాశనం చేయబడింది. ఇక ఎంత మాత్రమూ మన మీద అధికారం లేదు. **ప్రభువు ఆత్మ నా మీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను, చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డి వారికి చూపును, (కలుగునని) ప్రకటించుటకును నలిగినవారిని విడిపించుటకును ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు (లూకా 4:18,19)**

సాతాను చెరలో జీవిస్తున్న అనేకులకు ఆయన నామములో విడుదల ఉంది. దురాత్మలచేత పీడింపబడుతూ, వాటి పర్యవసానముగా అనేక వ్యసనముల మధ్యలో నలిగిపోయే వారికి విడుదలను అనుగ్రహించువాడు. ఆయన విడుదల అనుగ్రహించుట ద్వారా కుటుంబములు నెమ్మదిగా ఉన్నాయి.

కాబట్టి మనము ప్రతి ప్రార్థనలోనూ దేవుని శక్తిని జ్ఞాపకం చేసికొనుచు ముందుకు వెళ్ళవలసిన వారమై యున్నాము. యేసు అరణ్యములో సాతాను శోధనను జయించడం ద్వారా సాతాను ఆయనను విడిచి వెళ్ళింది. మన జీవితములో వాడి కార్యములు నాశనం చేయబడ్డాయి. అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవును అని చెప్పిన మాటను మనం జ్ఞాపకం ఉంచుకోవాలి. వాడికి మన మీద ఎంత మాత్రమూ అధికారం లేదు. దానిని బట్టి మనం ప్రతి దినమూ ఆనందించవలయును. **అపవాదికి చోటియ్యకుడి. (ఎఫెసీ 4:27)**

సిలువ ద్వారా దేవుడు మనకు సిద్ధపరచిన ఏడు ప్రాముఖ్యమైన ఆశీర్వాదములలో నాలుగింటిని మనము ధ్యానించుకున్నాము. మిగిలిన మూడింటి గురించి వచ్చే సంచికలో తెలుసుకుందాము.

ఆయన మిమ్ములను ఆశీర్వదించును గాక!.

# కెనడీ ఉజ్జీవం

1970 దశాబ్దం ఆరంభంలో ప్రార్థించి ఉజ్జీవ పరచడానికి దేవుడు వెస్టరన్ కెనడియన్ పట్టణంలోని స్థానిక కాపరిని నడిపించినప్పుడు అతడు దానికి లోబడ్డాడు. "సరే, నా కుమారుడా, నీవిప్పుడు నిద్రపోయి నేను చేసేదానికి ఆనందించు" అని ప్రభువు నుండి వినేంత వరకు అతడు ప్రార్థించడం కొనసాగించాడు.

ప్రజలు మధ్య రాత్రి రక్షింపబడే విధంగా దేవుడు కదలడం మొదలుపెట్టాడు. ప్రతి రాత్రి సమావేశం తరువాత, 20 లేక 30 మంది ప్రజలు ఉదయం 3 లేక 4 గంటల వరకు కూడుకొని ప్రార్థించేవారు. అన్ని రకాల ప్రజలు సమస్త విషయాలను సరి చేసుకుంటున్నారని స్థానిక వార్తా పత్రిక వ్యాసంలో నివేదించబడింది. "పట్టణంలో ఏమి జరుగుతుంది ?" అని డిపార్టుమెంటు స్టోరులు ఆశ్చర్యాన్ని వ్యక్తపరచాయి. వారి కౌంటర్ల నుండి ప్రజలు డబ్బులు దొంగతనం చేశారు. వారు దాన్ని తిరిగి ఇచ్చేయాలని భావించారు. పోలీసు డిపార్టుమెంట్ ఇలా చెప్పింది. "పట్టణంలో కొన్ని విషయాలు జరుగుతున్నాయి. ఎందుకంటే రాత్రి పూట నేరాల శాతం చాలా మట్టుకు తగ్గింది. ఏమి జరుగుతుంది?".

ఒక వ్యక్తి అధికారుల వద్దకు వెళ్ళి ఇలా చెప్పాడు. "నేను పనిచేసే వ్యక్తుల నష్టపరిహారాన్ని అపహరించాను. నేను ఉద్యోగంలో అసలు గాయపడనప్పుడు నేను గాయపడ్డాను గనుక నేను ఉద్యోగుల నష్ట పరిహారాన్ని పొందవచ్చని చెప్పాను. నేను జైలుకు వెళ్ళడానికి సిద్ధం. నా ఉద్యోగాన్ని కోల్పోవడానికి నేను సిద్ధం. ఏమి జరిగినా, నేను దేవునితో సరిగా ఉండాలని భావిస్తున్నాను" ఎవరో కెనడా ప్రధాన మంత్రికి వ్రాసి ఇలా చెప్పారు. "సర్, ఆదాయపు పన్నును చెల్లించని వెస్టరన్ కెనడియన్ పన్నును చెల్లిస్తారు గనుక కొత్త ఫండ్‌ను కేటాయిస్తే మంచిది. ఎందుకంటే వారు ప్రభుత్వాన్ని మోసం చేశారు. తిరిగి చెల్లించడం సమాజ దృష్టిని దేవుని వైపుకు మళ్ళిస్తుంది. "మా చుట్టూ జరుగుతున్నట్లు ముందు మేమెన్నడూ ఇలాంటి దేవున్ని చూడలేదు. లోకంలో ఏదో మంచి జరుగుతుంది" అని ప్రజలు చెప్పారు.

ఇది ఎలా జరిగింది? భారత దేశంలో రెండు గుంపుల వ్యక్తులు ప్రార్థిస్తున్నారని తరువాత తెలిసింది. ఒక గుంపు ఐదు సంవత్సరాల పాటు ప్రార్థించింది. "ప్రభువా, పశ్చిమ కెనడాలో ఉజ్జీవాన్ని పంపండి. గిద్యోనుకు సంబందించిన ఇద్దరు భారతీయ విశ్వాసులు ఇలా ప్రార్థించారు. "ప్రభువా, మేము ఉజ్జీవం కోసం ప్రార్థించగల కెనడాలో ఒక పట్టణాన్ని మా హృదయంలో ఉంచండి." దేవుడు వారికి సస్కాటూన్ పట్టణాన్ని ఇచ్చాడు. వారు

ప్రార్థించారు. మళ్ళీ ప్రార్థించారు. ఉజ్జీవ కాలంలో ఉన్న ఒక ప్రముఖ క్రైస్తవ రచయిత కెనడాలో ఇది జరిగిన ఒక సంవత్సరం తరువాత ఆయన భారత దేశంలో నిర్వహించబడిన గిద్యోను సమావేశానికి వెళ్ళాడు. అతడు చూసి అనుభవించిన దాని గురించి చెప్పాడు. ఇద్దరు వ్యక్తులు ఉత్సాహంతో ముందుకొచ్చి "ఇది ఎక్కడ జరిగిందని మీరు చెబుతున్నారు?" అని అతన్ని అడిగారు. అది "సస్కూటూన్, సస్కచ్‌వేన్ పట్టణం" అని అతడు చెప్పినప్పుడు "ప్రభువుకు స్తోత్రం! దేవుడు ప్రార్థనలకు జవాబు ఇచ్చాడు" అని వారు చెప్పారు.

ఒకవేళ నీవు, నేను దేవుని ముఖాన్ని వెదికి ప్రార్థించడానికి సమయాన్ని కేటాయించగలిగితే దేవుడు అలాంటి అద్భుత కార్యాలను కూడా నేడు చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. మీరు ప్రార్థించడానికి సిద్ధంగా ఉన్నారా?

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసనతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# చెప్పిన మాట వింటే...

– సిస్టర్ విజయ

ప్రస్తుత కాలములో తల్లిదండ్రుల మాటలు వినని పిల్లలు, ఉపాధ్యాయులను అపహాస్యం చేసే విద్యార్థులు మొత్తం మీద మాట వినని వారే అధికముగా కనబడుచున్నారు. మాటకి మాట ఎదురు చెప్పుట ఫ్యాషన్‌గా మారిపోవుచున్నది. వినుట అనేది కనుబడుటలేదు. ప్రేమించుటలో వినుట అనేది ఒక భాగం. పరిశుద్ధ గ్రంథమైన బైబిలు చెప్పుచున్న మాట ఏమనగా **"బలులు అర్పించుట కంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ల క్రొవ్వు అర్పించుట కంటే మాట వినుటయు శ్రేష్ఠము"** 1 సమూ 15:22

దేవుని మందిరములలో పాటలు పాడుటకు, ప్రసంగములు చేయుటకు చూపిస్తున్న సుముఖత దేవుని ఆజ్ఞలు గైకొనటానికి అనగా మాట వినటానికి చూపించుటలేదు. మనము ఏది చేసిననూ, ఆయన మాట వినని వారమైతే చేసినదంతయూ వ్యర్థమే. దేవుని మాట అనగా వాక్యము ద్వారా నీతో దేవుడు మాట్లాడుచున్నప్పుడు దానిననుసరించి నడుచుకోవడం నేర్చుకోవాలి. దేవుని సేవకుని మాటను దేవుని మాటగా భావించి, విధేయత చూపించి, సమృద్ధిని పొందుకున్న స్త్రీ సారెపతు అను పట్టణములో విధవరాలు. ఆమె జీవితమును ధ్యానించినప్పుడు అనేక విషయములను మనము తెలుసుకోవచ్చు.

ఆహాబు అను రాజు ఇశ్రాయేలు ప్రజలను పరిపాలిస్తున్న కాలములో కరవు సంభవించగా, అక్కడ ప్రవక్తగా ఉన్న ఏలియాకు దేవుని వాక్కు ప్రత్యక్షమై నీవు సారెపతు అను ఊరికి వెళ్ళి ఉండు, అక్కడ నిన్ను పోషించడానికి ఒక విధవరాలిని ఉద్దేశించాను అని చెప్పెను. సారెపతు అను పట్టణం మధ్యదరా సముద్ర తీరమున తూరు, సీదోను పట్టణముల మధ్య ఉన్నది. ఏలియా లేచి ఆ పట్టణపు గవిని యొద్దకు చేరిన వెంటనే అక్కడ ఒక విధవరాలు కట్టెలు ఏరుకుంటూ కనిపించెను. ఏలియా ఆమెను పిలిచి, నా యెడల దయచూపి తాగడానికి నీళ్లు ఇవ్వమనెను. ఆమె నీళ్ళు తేవడానికి వెళ్లబోవుచుండగా మరల ఆమెను మీ చేతితో ఒక రొట్టె ముక్క కూడా తీసుకురండి అని అన్నాడు. అందుకు ఆమె నా దగ్గర కుండలో పట్టెడు పిండి, బుడ్డిలో కొంచెం నూనె మాత్రమే ఈ రోజుకి సరిపడా ఉన్నాయి. నేను, నా కుమారుడు చావబోయే ముందు వాటిని సిద్ధము చేద్దామని కట్టెలు ఏరుకోవడానికి వచ్చాను అని అన్నది. వెంటనే ఏలియా ఆమెతో నిర్భయంగా ఉండుడి, వెళ్లి మీరు చెప్పినట్లు చేయండి. అయితే ముందు నా కోసం చిన్న రొట్టె చేసి తీసుకురండి. తరువాత మీకూ, మీ అబ్బాయికి రొట్టెలు చేసుకోండి, ఇశ్రాయేలు ప్రజల దేవుడైన యెహోవా ఇలా చెప్పుచున్నాడు. దేశం మీద యెహోవా వర్షం కురిపించే వరకు కుండలో

పిండి తగ్గిపోదు, బుడ్డిలో నూనె అయిపోదు. వెంటనే ఆమె వెళ్లి ప్రవక్త చెప్పినట్లు చేసింది. ఆమెకి ఆమె కుమారుడికి ఆ పట్టణములో కరవు పోయేంతవరకు తినడానికి తిండి ఉంది, కుండలో పిండి తరిగిపోలేదు, బుడ్డిలో నూనె అయిపోలేదు.

ప్రవక్త అయిన ఏలియా ఆ ఊరిలో ప్రవేశించేటప్పటికి అతను ఎవరో ఆమెకు తెలియదు. కానీ ఏలియా నీళ్లు అడిగినప్పుడు, ఇవ్వడానికి సిద్ధపడింది. వెంటనే మరల రొట్టెను కూడా అడిగాడు. ఈ సమయములో ఆమెకు అనేక అనుమానములు కలగడానికి ఎంతో అవకాశముంది. ఎందుకనగా అతను దేవుని ప్రవక్త అని, దేవుడు అతనిని అక్కడికి పంపించారని ఆమెకు తెలియదు. రొట్టె కానీ, నీళ్లు కానీ ప్రవక్తకు ఇవ్వకూడదు అన్న మనస్తత్వం కాదు కానీ తన స్థితి గురించి ఆలోచిస్తూ ఉండిపోయింది. ఈ ఒక్కరోజు ఈ వ్యక్తికి ఇచ్చి, మేము ఎందుకు బాధపడాలి అని తలంచక, తన స్థితిని ధైర్యంగా అతనితో చెప్పింది. వెంటనే అతని నోటి నుండి వచ్చిన మాటని దేవుని మాటగా భావించుకొని హృదయంలో విశ్వసించి, వెంటనే విధేయత చూపుట ద్వారా కుటుంబములో సమృద్ధిని పొందుకుంది.

ఈ దినము అనేకులు దేవుడు స్వరముతో మాట్లాడితేనే నేను వింటాను అని మోసపోవుచున్నారు. దేవుని వాక్యము బోధించబడుచున్నప్పుడు, మనము ధ్యానిస్తున్నప్పుడు అనేకసార్లు దేవుడు మనతో సూటిగా మాట్లాడుతారు. ఆ మాటలను హృదయంలో చేర్చుకొని, విశ్వసించి, ఆజ్ఞను గైకొనుట ద్వారా అవి మన జీవితంలో ఎన్నడూ వ్యర్థం చేయబడవు.

అదే విధంగా ప్రవక్త చెప్పిన మాటని వినుట మాత్రమే కాక, ఆచరణలో పెట్టింది. ప్రవక్త చెప్పినది విని, సరే అని తల ఊపి, ఇంటికి వెళ్లిన తరువాత అతను ఎవరో నాకు తెలియదు, నాకు, నా కుమారుడికి సరిపోయే ఆహారంలో అతనికి వాటా ఎందుకు ఇవ్వాలి? అని ఆలోచించి, ప్రవక్తని మోసం చెయ్యలేదు కానీ ఇచ్చిన మాట ప్రకారం రొట్టెలు తీసుకువెళ్లి ఇచ్చుట ద్వారా ఆ పట్టణములో కరవు అధికమైననూ, ఈ కుటుంబములో జీవిత కాలమంతా సరిపడా, సమృద్ధి అయిన ఆహారమును పొందుకుంది.

ఒక యౌవనస్థుడు ఇంటింటికి తిరిగి న్యూస్‌పేపర్స్ వేసేవాడు. ఒక దినము బాగా అలసిపోయి నీళ్లు త్రాగుదామని ఒక ఇంటి తలుపు తట్టి అడిగాడు.

ఆ ఇంట్లోని స్త్రీ నీళ్లకు బదులుగా ఒక గ్లాసు పాలు ఇచ్చుట ద్వారా వాటిని త్రాగి, చాలా బలము పొందుకున్నాడు. అతను తిరిగి వెళ్ళిపోయాడు. చాలా సంవత్సరములు

గడిచిన తరువాత  పాలు ఇచ్చిన ఆ(స్త్రీకి  అనారోగ్యం కలిగి ఆపరేషన్ చేయవలసి హాస్పిటల్‌లో జాయిన్ కావలసి వచ్చింది. అయితే వారి దగ్గర డబ్బు లేకపోవుటచే ఆపరేషన్‌ని ఆపివేసారు, ఆ హాస్పిటల్ కన్సల్టెంట్ డాక్టర్‌గా ఉన్న ఒక వ్యక్తి వచ్చి ఆమెను పరీక్షించి, వెంటనే ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేయడం జరిగింది. అంతా సవ్యంగా జరిగి డిశ్చార్జి అయ్యి ఇంటికి వెళ్ళిపోవు సమయంలో ఆమె చేతికి ఒక లెటరు ఇవ్వడం జరిగింది. ఆ లెటర్‌లో అమ్మా ! మీ బిల్లు అంతా చెల్లించబడినది అని ఉంది. ఆమె చాలా ఆశ్చర్యపోయి, నా బిల్లు చెల్లించినది ఎవరు, నేను వాళ్లని చూడాలి అని అడిగినప్పుడు ఆ కన్సల్టెంట్ డాక్టర్ ఆమె ముందుకి వచ్చి, చాలా సం॥ల క్రిందట త్రాగడానికి నేను నీళ్లు అడిగినప్పుడు ఇచ్చి, బలము పొందుకునేలా చేసిన పేపర్ బాయ్‌ని అమ్మా అని చెప్పాడు. నేను మీరు చేసిన సహాయమును మరచిపోలేక పోవుచున్నాను. ఏ విధంగా ప్రతిఫలమును ఇవ్వాలా అని ఎదురుచూస్తున్న నాకు ఇప్పుడు ఒక మంచి అవకాశం దొరికింది అని అన్నాడు.

ఇచ్చుట అనే చర్య ద్వారా పొందుట అనే ప్రతిచర్య చూడగలము. కాబట్టి ఇచ్చుట ద్వారా మనము నష్టపోయేది ఏదీ ఉండదు అని గ్రహించుకొని, ఎల్లప్పుడూ ఇచ్చేవారిగానూ, ఎదుటి వారికి సహాయం చేయుచూ, మాటల ద్వారా ప్రేమ, ఆదరణ చూపిస్తూ, సమయమును వ్యయపరచుట మాత్రమే కాక తమకు కలిగిన దానితో వ్యయపరిచి, అనేకులను ఆదుకొనుట ద్వారా తప్పక ప్రతిఫలమును పొందగలము.

కొంతమంది స్త్రీలు దేవుని మాట వింటూ, వారికి ఉన్నది వ్యయము చేయుచూ, ఇచ్చేవారిగా ఉంటూ జ్ఞానముతో కుటుంబములను కట్టుకొనుచుండగా మరి కొంతమంది దేవుని మాట వినక అజ్ఞానముతో కుటుంబములను నాశనం చేసుకుంటున్నారు. మనము ఏ స్త్రీల వలె ఉన్నామో పరిశీలించుకొని, మార్పు తెచ్చుకొనుట చాలా ప్రాముఖ్యమైనది.

కాబట్టి ప్రియమైన వారలారా ! కుటుంబములోని స్త్రీలమైన మనము ఎల్లప్పుడూ దేవుని మాటకి విధేయత చూపుచూ, అపరితమైన విశ్వాసముతో వాగ్దానములను హృదయంలోకి చేర్చుకుంటూ, వినుట, అనుసరించుట, ఇచ్చుట అనే క్రియల ద్వారా దేవుని ఆశీర్వాదమును పొందగలము.

అట్టి ధన్యత దేవుడు మనకు దయచేయును గాక !

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర



**- సీరియల్ 27వ భాగము**

ఇది ఒక్కటే కాదు, లామా దగ్గర పనిచేసిన ప్రధాన కార్యదర్శి కర్తార్ దగ్గర ఉన్న క్రొత్త నిబంధనను తీసుకున్నాడు. కర్తార్ మరణం అతని స్మృతిలో ఇంకా మెదులుతూనే ఉంది. ఆ స్మృతులతోనే అతడు ఆ క్రొత్త నిబంధనను చదువనారంభించి దానిలో ఉన్నది సత్యమని ఒప్పింపబడినాడు. క్రీస్తుని నమ్మడమే గాక లామాతో దానిని బాహాటంగానే చెప్పాడు. దీనిని విన్న లామా రౌద్రుడైపోయి కర్తార్‌లా చనిపోయేంత వరకు ఇతనిని యాక్‌చర్మములో ఉంచలేదు గాని ఎర్రగా కాల్చిన కడ్డీలను అతని శరీరమునకు గ్రుచ్చి చిత్రహింస చేశారు. పొడవాటి త్రాడుతో అతనిని కట్టి వీధుల్లో ఈడ్చుకొనిపోయి ఇంక చనిపోతాడులే అనుకొని పట్టణం వెలుపల ఉన్న ఓ చెత్తకుప్ప మీదకు లాగిపడేశారు. అయితే అతడు చనిపోలేదు. అంత భయంకరమైన హింస పొందిన తరువాత కూడా అతడు నెమ్మదిగా కోలుకొని చెత్తకుప్ప మీద నుండి లేచి పట్టణములోకి వెళ్ళాడు. తాము అంతగా చిత్రహింస చేసి చనిపోతాడు అనుకొన్నవాడు మరల బలం పొంది సజీవంగా తమ మధ్యకు రావడం చూచి వారు ఎంతో భయపడి పోయారు. వారు అతనిని మరల ఎదిరింపలేదు. ఇతడే కర్తార్ మరణం గూర్చి సుందర్‌కు చెప్పాడు.

కైలాస మహర్షిని గూర్చి చెప్పిన కథ కర్తార్ కథ కంటె ఎంతో విచిత్రంగా ఉంది. ఎందరో బౌద్ధ సన్యాసులు, ఇతర ఋషులు ఉండే మారుమూల ప్రాంతమైన కైలాస పర్వతములలో జీవించాడు ఈ మహర్షి. ఈ ప్రాంతం ఎంతో సుందరంగానూ, ఆహ్లాదకరంగానూ ఉంది. తనకు 300 ఏండ్లు అని ఆయన చెప్పారు. ఈ ఋషులలో చాలా మంది ఏకాంత వాసం చేస్తూ ఉంటారు. ఒకరితో ఒకరు కలుసుకోరు కూడా. మోక్ష సాధనకై వారు శాంతిని వెదుకుచున్నారు. అయితే మహర్షి వీరందరికి భిన్నమైనవాడు. ఇతడు ఒక క్రైస్తవుడు. ఒకానొక ఆకస్మిక పరిణామం వలన సుందర్ కైలాస మహర్షిని కలిసికొన్నాడు.

తనకు పూర్తిగా అపరిచితమైన పర్వత మార్గములో ఎగబ్రాకుతూ వెళ్ళుచున్న సుందర్‌కు కాలు జారడంతో ఆ కొండ ప్రక్కగా జారిపడి దొర్లుకుంటూ వచ్చి ఒక గుహ ముందు పడినాడు. కొంచెం తేరుకొని ఆ క్షణంలో తాను చూచిన దృశ్యమునకు ఉలిక్కిపడినాడు. అంతకు ముందు ఎన్నడూ అలాంటి దృశ్యమును అతడు చూడలేదు.

తనముందు ఉండిన గుహలో శరీరమంతా రోమాలతో నిండిన ఓ ఆకారమును చూచాడు. ఏదో జంతువేమోనని పరీక్షగా చూచిన సుందర్‌కు అతడు మానవుడేనని తెలియడంతో ఆశ్చర్యమునకు అంతు లేకపోయింది. అయితే గుహలోని వ్యక్తి ఎలాంటి ఆశ్చర్యము లేనివాడై సుందర్‌ని పిలిచి అతనితో దయగాను, స్నేహపూర్వకంగాను మాట్లాడాడు. అక్కడికి ఎలా వచ్చాడో ఎందుకు వచ్చాడో వివరిస్తూ స్వేచ్ఛగా సంభాషించాడు. ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో తాను జన్మించాడు. ముస్లిం యాజక పాఠశాలలో చేరి ముస్లిం పవిత్ర గ్రంథమైన ఖురాన్ను జాగ్రత్తగా పఠించాడు. తాను దేవునిని కనుగొనడానికి పడిన శ్రమంతా వృధా అని తెలిసికొని అసంతృప్తి చెంది సత్యం కొరకు ఆకలిగొని యున్నాడు. ఇండియా నుండి వచ్చిన పరి.ఫ్రాన్సిస్ జేవియర్ బంధువుడైన హియరానమస్‌ను ఎలా కలుసుకున్నాడో మనకు తెలియదు. హియరానమస్ ఆకలిగొనియున్న ఈ ఆత్మను క్రీస్తు వైపుకు నడిపించాడు. అన్ని యుగాల వారిని తన వైపుకు ఆకర్షించుకోవడానికి యేసుప్రభువు పలికిన **"ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి ; నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (మత్తయి 11:28)** మరియు **"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను"** అను మాటలు తనను గట్టిగా పట్టుకున్నాయి. ఈ మాటలను వెంబడించి పాపక్షమాపణ, సమాధానం అనే మహిమకరమైన విడుదలను పొందాడు. దీనినే మారుమనస్సు పొందడం అని పిలుస్తాము. తన బోధకునితో కలిసి కొంతకాలం క్రీస్తు ప్రభువును ప్రకటించాడు. తరువాత తూర్పు దేశములకు పిలుపును అందుకొని, సువార్త ప్రకటిస్తూ ఎన్నెన్నో దేశములు సంచరించాడు. ఇరవైకి పైగా భాషలు మాట్లాడగలడు. భారతదేశపు దుఃఖాన్ని మొరను భరించలేక ఈ ఉపఖండం కొరకు మిగిలిన దేశముల కొరకు ప్రార్థనా విజ్ఞాపనలు చేయడానికి హిమాలయాలలో ఉన్న ఒక గుహాలోనికి వచ్చాడు



# అనైక్యత

ప్రియమైన పిల్లలూ ఎలా ఉన్నారు? Exams దగ్గరకు వచ్చేసాయి కదా! బాగా Prepare అవుతున్నారా? Exams అయిపోతే Holidays లో Enjoy చేయవచ్చని ఒక ప్రక్కన, మరో ప్రక్కన Exams ఎలా వ్రాస్తామో అనే Tention తో ఉన్నారా? Don't worry God is with us (దేవుడు మీతో ఉన్నాడు భయపడకండి) మీరు చిన్నతనం నుండీ దేని విషయంలోనూ చింతించకండి. ప్రతీ చింత కలిగించే విషయాలను గురించి దేవునితో చెప్పేయండి. ఆయనే చూచుకుంటాడు మీరెంతో సంతోషంగా ఉండవచ్చు, సరేనా!

మనం మనతోటి వారితో ఐక్యతతో జీవించటం నేర్చుకోవాలి, తెలుసా? ఎందుకంటే ఐక్యత ఎంతమేలు! ఎంత మనోహరము! అక్కడ ఆశీర్వాదము ఉంటుందని బైబిల్ గ్రంథంలో దేవుడు ఎప్పుడో వ్రాయించాడు, మన పెద్దలు కూడా ఐకమత్యం ఎంతో బలమని చెబుతుంటారు. ఇప్పుడు మీకు ఒక మంచి కథ చెబుతాను జాగ్రత్తగా వింటారు కదా !.

నలుగురు వర్తకులు కలిసి సమిష్టిగా దూది వ్యాపారాన్ని ప్రారంభించారు. దూది బేళ్ళు ఒక గదిలో వేసి తాళం వేసేవారు. కానీ ఆ గదిలోని ఎలుకలు వాటిని పాడుచేస్తుండేవి, చాలా నష్టపోతుండేవారు. ఎలుకలుని అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. దాని కోసం ఒక పిల్లిని పెంచటం మొదలుపెట్టారు. ఆ పిల్లి ధర్మమా అంటూ ఎలుకల బాధ తగ్గిపోయింది. దాంతో ఆ వర్తకులకు లాభం రావటం మొదలు పెట్టింది. ఆ లాభాలకి కారణం పిల్లే అని గ్రహించుకుని ఆ పిల్లి నాది అంటే నాది అని తగువు లాడటం మొదలు పెట్టారు. అలాగు కొంతకాలం తగువులాడిన పిమ్మట వారు ఒక నిర్ణయానికి వచ్చారు. తమ విభేదాలు తొలగించటానికే పిల్లికి భగవంతుడు 4 కాళ్ళు ఇచ్చాడు అనుకొని ఒక్కొక్క కాలుని ఒక్కొక్కరు పంచుకున్నారు. ఎవరి కాలుకి వారు తమకు తోచిన అలంకరణ, సంరక్షణ చేయటం మొదలుపెట్టారు. నలుగురూ శ్రద్ధ చూపించటంతో పిల్లి దిట్టంగా పెరిగింది.

ఒక వర్తకుడు తన వంతుకు వచ్చిన పిల్లికాలికి బంగారు మువ్వలను కట్టాడు. కొత్త బరువు వలన పిల్లి కాలుకి పుండు అయ్యింది. అందుచేత ఆ కాలుకి మువ్వలు తీసివేసి

నూనెగుడ్డతో కట్టుకట్టాడు. పూర్వం లాగే దాన్ని గదిలో వదిలిపెట్టి చీకటి పడగానే ఆ గదిలో దీపం పెట్టి తాళం వేసుకుని వెళ్ళిపోయారు వర్తకులు. ఆ రాత్రి ఒక ఎలుక గదిలోనికి వచ్చింది. వెంటనే దాన్ని పట్టుకోవడానికి ఆ పిల్లి పరుగెత్తబోయింది., కానీ కాలు కుంటి అవటం చేత గురి తప్పి దీపం మీద పడింది. దాంతో ఆ కాలుకున్న నూనెగడ్డకు దీపం అంటుకుంది. పిల్లి గాబరాపడి గది అంతా చిందులు తొక్కింది. దాంతో కాలికున్న నిప్పు దూది బేళ్ళకు అంటుకుని అవి అన్నీ తగులబడి పోయాయి.

మరునాడు వర్తకులు అంతా ఆ ఘోరాన్ని చూచి దానికి కారణం వారిలో ఒకరు పిల్లి కాలికి నూనెగుడ్డ కట్టడం వలనే ఇదంతా అని నిర్ధారణ చేసుకుని మిగిలిన ముగ్గురూ ఆ నాలుగోవాడిని తమకు వచ్చిన నష్టానికి పరిహారం ఇమ్మని అడిగారు. ఇది వాడికి చాలా కష్టం అన్పించింది. తన వంతు సరుకు పోయిందని ఏడవాలో, ముగ్గురికీ నష్టపరిహారాన్ని ఇవ్వాలని ఏడవాలో అర్థం కాలేదు. అంత మొత్తం ఇచ్చుకోలేను కొంత ఇస్తాను అని బతిమాలాడు. కానీ వాళ్ళు తమ మొత్తాన్ని అణాపైసాతో సహా ఇచ్చుకోవాలని ఒత్తిడి తెచ్చారు. వాడు ఇవ్వలేనని మొరాయించటంతో వాళ్ళు పంచాయితీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. పెద్దలు వారి వాదనలు శ్రద్ధగా విని అసలు విషయాన్ని జాగ్రత్తగా గ్రహించారు. క్రింది విధంగా తీర్పుచెప్పారు. నాల్గవ వర్తకునికి చెందిన పిల్లికాలికి దెబ్బతగలడం చేత అది కుంటిదైపోయింది. మిగిలిన మూడు కాళ్ళే పరుగెత్తే స్థితిలో ఉన్నాయి. ఆ కాళ్ళ పరుగు వలనే నాల్గవ కాలికి కట్టియున్న  నూననెగడ్డకు నిప్పంటుకుంది. తరువాత ఆ కాళ్ళే నిప్పును దూది బేళ్ళకు అంటించాయి. అందుకే దూది గిడ్డంగి తగులబడింది. కాబట్టి ఆ ముగ్గురు వర్తకులు 4వ వానికి చెందిన వాటాకు సంభవించిన నష్టానికి పరిహారం చెల్లించాలి అని తీర్పునిచ్చారు. అది విని ముగ్గురూ ఖంగుతిన్నారు. ఎంతో దుఃఖపడ్డారు. తగువులాడి తీర్పుకి వెళితే మొదటికే మోసం వచ్చిందని మదనపడి నాల్గవ వానికి నష్టపరిహారం చెల్లించారు.

పిల్లలూ! విన్నారుగా ఆ నలుగురూ ఐక్యతతో ఉండకుండా అసమంజసంగా పిల్లిని పంచుకుని, తగువులాడుకుని చిక్కులలో పడి వ్యాపారాన్ని నష్టపోయారు. వారు ఐక్యతగా ఉంటే ఏ కష్టము, నష్టము వచ్చేది కాదు. కాబట్టి పిల్లలూ చిన్నతనం నుండే మీరు ఐక్యత కలిగి జీవించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇచ్చిపుచ్చుకొనుటలో పట్టువిడుపు ఉండాలి. అనవసరమైన వాదనలు, అజ్ఞానపు నిర్ణయములు మనకు తీరని నష్టములను కలిగిస్తాయి. కాబట్టి చిన్నతనము నుండే మీరు ఐక్యత కలిగి జీవించునట్లుగా దేవుడు జ్ఞానమును కలిగించాలని నా ప్రార్థన. All the Best పిల్లలూ మళ్ళీ Holidays లో కలుద్దాం.

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

**యాకోబు, భీమనపల్లి**

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి వందనములు. నా పేరు యాకోబు, మాది విగ్రహారాధన కుటుంబము. నాకు లేని వ్యసనం అంటూ లేదు, బాగా తాగేవాడిని. అలా తాగడం వలన ఒక భయంకరమైన టి.బి వ్యాధి వచ్చింది. నాకు నలుగురు కుమార్తెలు. అంతకు ముందే పెద్ద కూతురి వివాహం చెయ్యటం వలన మా వద్ద చిల్లిగవ్వ కూడా లేదు. నా భార్య బాధపడి, ఎంత కష్టం చేసినా ఇంట్లో గడిచేది కాదు. అందుకే మా రెండవ అమ్మాయిని మట్టి పనికి పంపేవాడిని. ఇలా ఉండగా నాకు టి.బి బాగా ఎక్కువయ్యింది. అప్పటికి మా వద్ద డబ్బులు లేక నా భార్య 20 వేలు అప్పు తెచ్చి డాక్టర్ దగ్గరకు వెళ్లినప్పుడు బ్రతకడం కష్టం అని డాక్టర్ చెప్పాడు. అప్పుడు ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో మా రెండవ కుమార్తెను ఇంట్లో పనిచేయడానికి కుదుర్చుకొని ఇబ్రహీంపట్నం పంపించాము. మా అమ్మాయి పని చేస్తున్న ఇంటి యజమాని దేవుని సేవకులు. ఇది ఇలా ఉండగా నాకు ఈ వ్యాధి మరింత ఎక్కువయ్యింది. నన్ను చూసి నా పిల్లలే భయపడే విధంగా తయారయ్యాను. ఇక నేను బ్రతుకను చనిపోతాను అని మిగిలిన ఇద్దరు పిల్లలను హాస్టల్‌లో వేశాను.

ఇక మా రెండవ అమ్మాయి మందిర ఆవరణములో ఉండి దేవుని గురించి తెలుసు కుంటూ ఉంది. నా భార్య ఆమెకు ఫోన్‌చేసి, డాక్టర్లు నాన్న చనిపోతాడు అని చెప్పారని చెప్పింది. అప్పుడు మా పాప అమ్మా మీరు ఏమీ భయపడకండి, నేను మా పాస్టర్‌గారితో చెప్పాను నాన్నను ఇక్కడికి తీసుకొని రా అని చెప్పింది. నేను బాగా విగ్రహారాధన, పూజలు చేసేవాడిని కనుక దేవుని మందిరం అంటే కోపం వచ్చేది. అందుకే, మేము ఆమె దగ్గరికి వెళ్ళకుండా విగ్రహ సంబంధమైన వాటి దగ్గరకి వెళ్ళినప్పుడు నాకు ఎవరో మంత్రాలు చేశారు అని చెప్పి, గుమ్మడికాయ తల మీద పెట్టి, దానిపైన వెలిగించి, ఆ గుడి చుట్టూ 5 సార్లు త్రిప్పి ఒక తాయత్తు వేసి 1000 రూ॥ అడిగాడు. అలా వెళ్ళిన ప్రతిసారి 1000 లేదా 1500 అడిగేవాడు. ఇలా తిరగడం వలన మందులకోసం అని అప్పు తెచ్చిన డబ్బులు అన్నీ అయిపోయాయి. ఇంక ఎవరిని అడిగినా అప్పు ఇచ్చేవారు లేరు. అప్పుడు నా రెండో కూతురు చెప్పిన మాట గుర్తుకు వచ్చి ఎలాగో ఇంత మంది దగ్గరకి వెళ్ళాను కదా, ఈ దేవుని దగ్గరకు వెళ్ళి వస్తే ఏమైనా ఉపయోగం ఉంటుందేమోనని అనుకొని వెళ్ళాను. అప్పుడు అక్కడ పాస్టర్‌గారు నా తల మీద చెయ్యి పెట్టి ప్రార్థన చెయ్యడం మొదలుపెట్టగానే నాలోని చీకటిశక్తి పారిపోవడం నా కూతురు చూసి భయపడింది గాని నాకు మాత్రం ఏమీ గుర్తు లేదు. తరువాత వారం వారం మందిరమునకు వెళ్ళి విశ్వాసముతో ప్రార్థన చేసుకోవడం ద్వారా

నాకు టి.బి పూర్తిగా నయం అయ్యింది. తరువాత నేను పని నిమిత్తం రామోజీ ఫిల్మ్ సిటీ దగ్గర అనాజ్‌పూర్ అనే గ్రామమునకు వచ్చాను. ఆ ఊర్లోనే ఎపఫ్రా మినిస్ట్రీస్ మందిరమునకు వెళ్తూ, మారుమనస్సు పొంది 2004వ సంవత్సరం ఫిబ్రవరిలో బాప్తిస్మం పొందడం జరిగింది. ఈ విధంగా నడుస్తూ ఉండగా, కొన్ని దినముల తరువాత ఆరోగ్యం బాగోలేక డాక్టర్ దగ్గరికి వెళ్ళాను కానీ, నాకు మాత్రం మనస్సులో మరల టి.బి వ్యాధి వచ్చిందేమో అని అనుమానం కలిగింది కానీ డాక్టర్‌గారిని అడిగినప్పుడు నీకు మరల ఆ వ్యాధి రాదు అని ఎంతో నమ్మకంతో చెప్పాడు.

మా రెండవ అమ్మాయి 4 వ తరగతి వరకు మాత్రమే చదివింది. అప్పటికీ ఆమె చదువు ఆపేసి చాలా సంవత్సరములు అయ్యింది కనుక ఆమెకు చదువు వచ్చేది కాదు. నేను ఆమెను చదివించలేక పోయాను అని మనసులో ఎంతో బాధపడేవాడిని. దేవుని కృప వలన ఆ పాప పని చేసుకుంటూ, చదువుకొని హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తుంది.

చిన్న కూతురు కూడా నర్సుగా జాబ్ చేస్తుంది. మా స్వంత గ్రామములో ఒకప్పుడు మాకు ఇల్లు ఉండేది కాదు, అక్కడికి వెళ్ళినప్పుడు వేరే వాళ్ళ ఇంట్లో పండుకొనే వాళ్ళం. కాని మాకు ఇప్పుడు ఆ ఇబ్బంది లేకుండా దేవుని కృప వలన ఇల్లు కట్టుకోవడం జరిగింది. ఇలా ప్రతి విషయములో దేవుడు మాకు ఎన్నో మేలులు చేశాడు. నేను నా చిన్నతనములో స్కూల్‌కి వెళ్ళలేదు, నాకు చదవడం కూడా వచ్చేది కాదు, కానీ దేవుడు నాకు బైబిల్ చదివే విధంగా జ్ఞానమును దయచేశాడు. ఇప్పుడు బైబిల్‌ను చదవగలను.

మా అమ్మాయిలు అనిత, అవంతి వివాహ విషయములలో తోడైయుండి మంచిమార్గములో నడిపించమని మీరందరూ ప్రార్థించగలరు.


## గుడ్ ఫ్రైడే ఆరాధన

**మార్చి 29వ తేది (శుక్రవారం)**

ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.

**వివరములకు:**

9666666249 | 040-24202227

# స్వ'పాలన' శాపము

క్రైస్తవ నాయకులు మరియు విశ్వాసులు వారి జీవితకాలమంతటిలో అనేకమైన పనులు చేయవలసినవారై యున్నారు. అవి ఆయా రంగములకు సంబంధించిన విషయములు కావచ్చును. ఏ మనుష్యుడు అన్ని రంగములలో నిష్ణాతుడై యుండలేదు, ఉండవలసిన అవసరం కూడా లేదు. కనుక మనకు తెలియని విషయములను గురించి ఆయా రంగములలో జ్ఞానవంతులైన వారి సలహాలను పొందవలసిన అవసరత ఉంటుంది.

ఆధ్యాత్మికతలో ముందుకు వెళ్ళుచున్నాము లేక మునిగిపోయాము అని అనుకునే అనేకులు తరచుగా తమకు అందుబాటులో ఉన్న సూచనలను, సలహాలను పెడచెవిని పెడుతుంటారు. బహుశా తమకు తెలియకుండా తామే తమ చుట్టూ అదృశ్యమైన గోడలను నిర్మించుకుంటారు. ఎలా? "దైవసంబంధమైన" పెద్ద పెద్ద మాటలు పలకడం ద్వారా.

"దేవుడు నాకు ఇలా చెప్పాడు, దేవుడు నాకు అలా చెప్పాడు" అంటారు. అలాంటప్పుడు దేవుడు చెప్పిన దానికి ఎదురు చెప్పేవారు ఎవరు ఉంటారు? ఒకవేళ దానిని గురించి ఎవరైనా అభ్యంతరములు లేవదీయడానికి సాహసిస్తే సాధారణంగా వాటిని పట్టించుకోరు. 1935 సంవత్సరం ఆరంభంలో ఒక డినామినేషన్‌కు చెందిన ఒక వ్యక్తి తనకు ప్రభువు వద్ద నుండి ఒక సందేశం వచ్చిందన్నాడు. దక్షిణ కాలిఫోర్నియాలో మనోహరమైన పర్వతశ్రేణుల్లో ఒక పెద్ద మందిరం లాంటిది నిర్మించి తమ డినామినేషన్‌కు చెందిన కాన్ఫరెన్సులు, సమ్మర్ క్యాంపులు అక్కడ జరగాలని ఉద్దేశించాడు.

బిగ్‌బేర్ సరస్సు వద్ద కొంత భూమిని కొని, అక్కడొక పెద్ద మందిరమును కట్టడానికి పనివాళ్ళను నియమించాడు. ఆ మందిరం అష్టభూజాకారం కలిగి వెడల్పయిన, చదునైన కప్పుతో చాలా విశాలంగా ఉండాలని కోరాడు. ఆ సహవాసంలోని కొందరికి ఆ కొండలలో ఇళ్ళు కట్టించడం విషయంలో కొంత అనుభవం ఉంది. వారు తమ నాయకునితో ఇలా అన్నారు. "అయ్యగారూ, ఆ మందిరమును మీరు కట్టడానికి ఉద్దేశిస్తున్న తీరు చూస్తుంటే చాలా ప్రమాదకరమైన తప్పు చేస్తున్నారేమో అనిపిస్తుంది".

ఏమండీ, నా పథకమును ప్రశ్నించవద్దు. ప్రభువే నాకిది ఇచ్చాడు. అని అతని జవాబు. కొద్ది రోజులకు ఒక ఇంజనీరు ఆ వైపుగా కారులో వెళ్తూ అక్కడ జరుగుతున్న కట్టడాన్ని చూశాడు. కారు ఆపి ఆ నాయకుణ్ణి సమీపించి కట్టడం నమూనాలో కొన్ని లోపాలున్నట్లుగా సూచించాడు. అంత మంచి మనసుతో సహాయం చేద్దామని అతడు వస్తే అతనికి ఎదురైంది నిరాదరణే. ప్రతి కట్టడం నమూనాను గవర్నమెంటు వారికి ముందుగా

సమర్పించి ఆమోదం తీసుకోవడం ఆ రోజులలో అవసరం లేదు. నీకు ఎలా కావాలంటే అలా దేన్నైనా నిర్మించుకోవచ్చు. అంతే కాకుండా ఆ కాలంలో అమెరికా దేశం గొప్ప ఆర్థిక సంక్షోభంలో ఉంది. డబ్బు కూడబెట్టడం చాలా కష్టంగా ఉండేది.

మంచు పడే ప్రాంతములలో నివసించే వారికి ఈ కట్టడం నమూనాలోని పొరపాటు ఏమిటో ఇప్పటికే అర్థమై ఉంటుంది. కాలిఫోర్నియాలో సైతం కొండలలో విపరీతంగా మంచు కురుస్తుంది. మరి ఈ గొప్ప మందిరం చూడండి దాని వెడల్పు 200 మీటర్లు. ఒకే నిలువు గలిగి ఎలాంటి ఆధారమూ లేని పొడవైన దూలాలపై బల్లపరుపుగా ఉన్న పై కప్పు నిలిచి ఉంది. ఆ ప్రాంతం సముద్ర మట్టానికి 6000 అడుగుల ఎత్తున ఉంది. చలికాలంలో మూడు నాలుగు అడుగుల ఎత్తుగా మంచు కురిసి పేరుకుపోవడం మామూలే. ఏం జరిగిందనుకుంటున్నారు ?

ఆ మందిరములో ఒక్క మీటింగైనా జరుగకముందే చలికాలం వచ్చింది. తుఫాను గాలి వీచి మంచు కురిసింది. మందిరం ఒక్కపెట్టున కూలిపోయింది. బల్లపరుపుగా ఉన్న పై కప్పుపై నిలిచిన మంచు బరువుకు మందిరమంతా పనికిరాని చెత్తకుప్పగా కూలిపోయింది.

క్రైస్తవ పరిచర్యలో ఇలాంటి “దేవుడు నాకు చెప్పాడు” అనే ప్రవృత్తి విషయములో నాయకులు, విశ్వాసులు బహు జాగ్రత్త కలిగి ఉండాలి. నేటి దినములలో చూస్తే కొన్ని సంఘములలో ఈ జాడ్యము బహుగా విస్తరించింది. నాయకుల దగ్గర నుండి ప్రారంభించి, చిన్న వారి వరకు వారికి తెలియని విషయముల గురించి కూడా “దేవుడు చెప్పాడు” అనే మాటను అడ్డుపెట్టుకొని ఘోరమైన మూర్ఖులుగా ప్రవర్తిస్తూ ఉంటారు. వారిని సరియైన దారిలో పెట్టడం దాదాపు అసాధ్యంగా ఉంటుంది. అట్టివారు పైన చదివిన వాస్తవ సంఘటనను బట్టిగాని, తమ జీవితంలో నష్టపోయిన విషయములను బట్టిగాని ఆత్మ పరిశీలన చేసుకొని మనకు తెలియని విషయములలో ఎదుటివారి సలహాలను ఆహ్వానిద్దాము.

అట్టి ధన్యతను దేవుడు అనుగ్రహించును గాక!

# రూపాయి, యూరో, పౌండ్, డాలర్



**ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును, హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్త కీడులకు మూలము (1 తిమోతి 6:9,10)**

ధనాపేక్ష వలన అవివేకులము ఎలా అవుతామో గమనించుకుంటే ఆశ్చర్యము కలుగుతుంది. హానికరమైన దురాశలు అనగా అపాయకరమైన దురాశలు అనుకోవచ్చు. నేటి నవనాగరిక ప్రపంచములో లెక్కలేనన్ని దురాశలు మానవుని జీవితమును నాశనం చేయుచున్నవి. తిమోతికి వ్రాసిన పత్రికలో పౌలు తిమోతికి ధనాపేక్షను గురించి ఎన్నో హెచ్చరికలు చేయడం జరిగింది. అంతేకాకుండా మన ప్రభువైన యేసుక్రీస్తు శరీరధారిగా ఉన్న దినములలో ధనాపేక్ష ఎంత కీడులకు మూలమో అనేక ఉపమానముల ద్వారా హెచ్చరించారు.

మన దేశంలో గమనిస్తే ఎన్నో సంవత్సరములు కష్టపడి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారు కూడా ధనాపేక్షలో పడి వారి భవిష్యత్‌ని నాశనం చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నాము. వారికి తినడానికి తిండి లేక కాదు కానీ, ధనాపేక్ష వారిని జైళ్ళపాలు చేసి వారి విలువనంతా దిగజార్చడం మనం గమనించగలం. ధనాపేక్ష వ్యసనము కంటే ఘోరమైనది అని అనుకోవచ్చు. ఎందుకనగా అది ఏ స్థాయిలో కూడా తృప్తి అనేది లేకుండా చేస్తుంది.

క్రీస్తుని ఎరిగిన మన జీవితములలో ఎన్నడూ ధనాపేక్ష వలన కలిగే దురాశలలో చిక్కుకొనకూడదని తప్పక గ్రహించాలి. దురాశలను ప్రోత్సహించే సంఘటనలు నేడు అనేక క్రైస్తవ సంఘములలోను కనిపించడం శోచనీయమైన సంగతి. క్రైస్తవ సంఘములలో కొంత డబ్బు మొదట చెల్లించుట ద్వారా ప్రతినెల అంతకంటే ఎక్కువ డబ్బులు సంపాదించ వచ్చును అని కొన్ని స్కీమ్స్ ప్రకటించడం దీనికి ఉదాహరణ. వీటికి క్రైస్తవులు అని చెప్పుకునే దురాశపరులు ఆకర్షించ బడుచున్నారు. ఇలాంటి పథకములు పేదల కొరకు ఎవరైననూ ఉద్దేశించినప్పటికి దీనిలో 90 శాతము కంటే ఎక్కువ మంది లబ్దిదారులు అన్నీ కలిగి ఉన్న దురాశపరులే అనేది కఠోరమైన సత్యం. మనము కలిగియున్న ధనము ఇతరుల కొరకు ఏ విధంగా వినియోగించాలి అనే ఆలోచన కంటే ఇతరుల ధనమును మనము ఎలా వశపర్చుకోవాలి అనే దాని మీద శ్రద్ధ. ఉచితం లేదా లాభం అంటే నేను అర్హుడినా కాదా అని కూడా ఆలోచించకుండా దానిని పొందాలి అని అనుకోవడం క్రైస్తవులకు తగదు.

క్రీస్తునందు విశ్వాసముతో జీవించుచున్న మనము దురాశపరులము కాకుండా ఉండడానికి దేవుని సన్నిధిలో మంచి తీర్మానము చేసుకుందాము.

అట్టి ధన్యత దేవుడు మనకి అనుగ్రహించును గాక !

# ప్రార్థనా శక్తి

## పేతురు

ప్రార్థన యొక్క ప్రత్యక్షత ఫలితంగా 16 మంది సైనికుల కావలిలో యుండి సంకెళ్ళతో బంధింపబడిన పేతురు చెరసాల నుండి అద్భుతంగా విడుదలైనాడు (అపో.కా 12:4,6) అతను చెరసాలలో ఉంచబడిన తరువాత సంఘం అతని కొరకు అత్యాసక్తితో, పట్టుదల కలిగి ప్రార్థించింది. **(అపో.కా॥ 12:5) దేవుడు వారి ప్రార్థనలు విని, పేతురును నిద్రలేపి, చెరసాల బయటకు నడిపించుటకు ఒక దూతను పంపాడు. దూత అతనిని నిద్రలేపినపుడు సంకెళ్ళు తెగి పడిపోయాయి. చెప్పులు వేసికొని, పై వస్త్రము తీసికొని తన వెంట రమ్మని ఆ దూత పేతురుకు సూచించాడు.** ఆ సంఘటన చాలా అద్భుతమైనది. కాబట్టి పేతురు తాను దర్శనం చూస్తున్నానని అనుకున్నాడు. అతను ఆ దూతను అనుసరిస్తూ సైనికులను ఇనుప ద్వారమును దాటి పట్టణములోకి అడుగుపెట్టాడు. ఆ ద్వారం దానంతట అదే తెరుచుకుంది. ఆ దూత మాయమయ్యాడు. పేతురు విడుదల పొందాడు. మనుష్యులు ప్రార్థించినపుడు కూడా ఈ విధమైన అద్భుతములు జరుగుతాయి.

మరియొక సందర్భములో యొప్పే అను పట్టణములో తబిత అను ప్రియమైన స్త్రీ చనిపోయింది. ఆ ప్రజలు, పేతురు పొరుగు ఊరిలో ఉన్నాడని తెలిసికొని, అతని కోసం కబురు పంపగా అతను వచ్చాడు. అతను వచ్చినపుడు తబిత యొక్క స్నేహితులు అనేక మంది చాలా బాధపడుతూ, ఆమె గదిలో ఉండుట చూచాడు. **"పేతురు అందరిని వెలుపలికి పంపి మోకాళ్ళూని ప్రార్థన చేసి, శవము వైపు తిరిగి - తబితా, లెమ్మనగా ఆమె కన్నులు తెరచి పేతురును చూచి లేచి కూర్చుండెను."**

**యేసు ప్రార్థనల యొక్క శక్తి :-**

యేసు మన కొరకు ప్రార్థిస్తాడని మనకి తెలుసు. **లూకా 22:32లో ఆయన పేతురుతో "అయితే నేను నీ కొరకు ప్రత్యేకంగా ప్రార్థించాను** అని, **యోహాను 17:19** నందు తన **శిష్యుల గురించి "నేను వారి కొరకు ప్రార్థించాను"** అని చెప్తున్నాడు. అదే అధ్యాయంలో **"వారి కొరకు మాత్రము ప్రార్థించుట లేదు, వారి వాక్యము వలన నా యందు విశ్వాసముంచువారందరును ఏకమైయుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను,** అని చెప్తున్నాడు. అంటే నీ గురించి, నా గురించి ప్రార్థిస్తున్నాడు (యోహాను17:20) **హెబ్రీ 7:25 "ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున విజ్ఞాపనము చేయుటకు**

**నిరంతరము జీవించుచున్నాడు, గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడైయున్నాడు"** అని చెప్తుంది. **రోమా 8:34 "దేవుని కుడిపార్శ్వమున ఉన్నవాడును, మన కొరకు విజ్ఞాపనము కూడా చేయువాడును ఆయనే"** అని బోధిస్తుంది. యేసు మన విజ్ఞాపన కర్త, మన కొరకు ప్రార్థించుటకు ఆయన జీవించును.

ఒక విజ్ఞాపనకర్త ఏమి చేస్తాడు ? దేవునికి, ఒక వ్యక్తికి మధ్య ఖాళీ స్థలములో నిలువబడతాడు. మనందరం ఆయన వలె పరిశుద్ధులము, సంపూర్ణలము, జ్ఞానులము కాదు. అయితే యేసు ఆ ఖాళీ స్థలములో నిలువబడి, దేవునికి – మనతోను – లేక మనకు, దేవునితోను సహవాసము కలుగజేస్తున్నాడు, ఆయన మన ప్రార్థనలకు జవాబిస్తున్నాడు. మన అర్హత లేని ప్రార్థనలను దేవునికి అంగీకారయోగ్యంగా చేస్తూ, యేసు ఎల్లప్పుడూ విజ్ఞాపన చేస్తున్నాడు. మన ప్రార్థనలు దేవునికి అంగీకారయోగ్యం అయినపుడు, ఆయన విని, దానికి బదులుగా తన శక్తిని విడుదల చేస్తాడు.

ప్రార్థన యొక్క శక్తి కంటే గొప్ప శక్తి ఎవరికీ అందుబాటులో లేదు. ఈ లోకములో అత్యంత శక్తివంతమైన, అద్భుతమైన, ప్రభావవంతమైన శక్తి కూడా దేవుని శక్తితో పోల్చినపుడు శక్తిహీనమై యున్నది. మన అనుదిన పరిస్థితులలో, సంఘటనలలో దేవుని శక్తి మనకు అవసరమైయున్నది. దేవుని శక్తితో మనలను కలిపి, ఆయన శక్తి మన జీవితములలో విడుదలగుటను సాధ్యం చేసేది ప్రార్థనయే. మరియు యేసు మన విజ్ఞాపన కర్త. ఆయన మన యొక్క అపరిపూర్ణమైన ప్రార్థనను అడ్డగించి, పరిపూర్ణ వ్యక్తి చేసిన, పరిపూర్ణ ప్రార్థనలుగా తండ్రికి వినిపిస్తాడు. ప్రార్థన శక్తివంతమైనది, కాబట్టి నీ జీవితములో, పరిస్థితులలో మంచి నిర్ణయములు తీసికొనుటకు, విజయం సాధించుటకు శక్తి కావాలనుకుంటే ప్రార్థించు !


## ఉపవాస ప్రార్థన

**ఉపవాస ప్రార్థన – 2013, మే 1వ తేది (బుధవారం)**

ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.

ఆసక్తి కలిగినవారు మాత్రమే పాల్గొనవలసినదిగా మా విన్నపం.

**వివరములకు:**


9666666249 | 040-24202227

# ఎష్కోలు లోయ

హెబ్రోనుకు ఉత్తరముగా ఉండు లోయ ఎష్కోలు లోయ. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి కనానుకు చేరు మార్గమధ్యములో యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. నేను ఇశ్రాయేలీయులకు ఇచ్చుచున్న కనాను దేశమును సంచరించి చూచుటకు నీవు మనుష్యులను పంపుము. వారి పితరుల గోత్రములలో ఒక్కొక్కదాని నుండి ఒక్కొక్క మనుష్యుని మీరు పంపవలెను. వారిలో ప్రతివాడు ప్రధానుడై యుండవలెను (సంఖ్యా 13:1) ఈ విధంగా పంపబడిన 12 మంది వేగుల వారు ఆ దేశజనులు ఎలాంటి వారో, ఆ పట్టణములు ఎట్టివో తెలుసుకొనుటకు సీను అరణ్యము మొదలుకొని, హమాతుకుపోవు మార్గముగా రెహోబు వరకు దేశసంచారము చేసి వచ్చిరి. ఆ దేశపు పండ్లలో కొన్ని తీసికొని రండని మోషే చెప్పిన మాట ప్రకారం



అది ద్రాక్షల ప్రథమ పక్వకాలము గనుక హెబ్రోను వద్దకు వచ్చి, ఎష్కోలు లోయలోనికి వచ్చి అక్కడ ఒక్క గెల గల ద్రాక్షచెట్టు యొక్క కొమ్మను కోసి, దండెతో ఇద్దరు మోసిరి. మరియు వారు కొన్ని దానిమ్మ పండ్లను, కొన్ని అంజూరపు పండ్లను తెచ్చిరి. ఇశ్రాయేలీయులు అక్కడ కోసిన ద్రాక్షగెలను బట్టి ఆ స్థలమునకు ఎష్కోలు లోయ అను పేరు పెట్టబడెను. (సంఖ్యా 13:24) అట్లు వారు 40 దినములు ఆ దేశమును సంచరించి చూచిరి. 12 మందిలో కాలేబు, యెహోషువ అను వారు తప్ప మిగిలిన 10 మంది ఎష్కోలు లోయలోనికి వెళ్ళి ఆ దేశమును చూచి తిరిగి వచ్చి ఆ జనులు మన కంటె బలవంతులు, మనము వారి మీదికి పోజాలమనిరి. మరియు వారు తాము సంచరించి చూచిన దేశమును గూర్చి ఇశ్రాయేలీయులతో చెడ్డ సమాచారము చెప్పి వారి హృదయమును అధైర్యపరిచిరి గనుక, యెహోవా తమకి ఇచ్చిన దేశమునకు వారు వెళ్ళక పోయిరి. యెఫున్నె కుమారుడైన కాలేబును, నూను కుమారుడైన యెహోషువయు మాత్రమే నిండుమనస్సుతో దేవుని అనుసరించి, ఆ ప్రాంతమును స్వాధీనపరచుకున్నారు.




# బైబిల్ క్విజ్ -27

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.

యూదా, ప్రకటన గ్రంథం నుండి ఇవ్వబడినవి

1. మోషే యొక్క శరీరమును గూర్చి ఎవరు ఎవరితో తర్కించారు?
2. వేటితో దేవుని కోపము సమాప్తమాయెను?
3. ఈ గ్రంథములో భవిష్యత్ విషయములు వ్రాసి ఉన్నాయి అని ఎక్కడ చెప్పబడింది?
4. దేనిలో నిలుచునట్లు కాచుకొని యుండాలి?
5. అల్ఫయు, ఓమెగయు, మొదటివాడను కడపటివాడను, ఆదియు అంతమునై యున్నవాడు ఎవరు?
6. ప్రకటన అనగా అర్థము ఏమి?
7. ఇశ్రాయేలీయుల గోత్రములన్నిటిలో ముద్రింపబడిన వారు ఎంతమంది?
8. సంఘములకు తీర్పు తీర్చేవాడు (యేసుక్రీస్తు)గా ఏ అధ్యాయములు తెలుపును?
9. దేనిలో నుండి లాగినట్టు కొందరిని రక్షించాలి?
10. జీవించుచున్నావన్న పేరు మాత్రమున్నది గాని నీవు మృతుడవే అని ఎవరు ఎవరితో అన్నారు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఏప్రియల్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే 2013 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 26 జవాబులు (యోహాను వ్రాసిన పత్రికలు) :**

1. తన్ను భద్రము చేసికొనును గనుక **(1 యోహాను 5 :18)**
2. **దియొత్రెఫే (3 యోహాను 1:9)**
3. **యోహాను** వ్రాసిన రెండవ పత్రిక
4. యేసుక్రీస్తు అను ఉత్తరవాది (1 యోహాను 2:1)
5. **దేమేత్రియు (3 యోహాను 1**:12
6. క్రీస్తు విరోధి (1 యోహాను 2:22)
7. **యేసుక్రీస్తే (1 యోహాను 5**:5,6)
8. **దేవుని (2 యేహాను 1**:9)
9. **కయీను (1 యోహాను 3**:12)
10. విశ్వాసము (1 యోహాను 5:4)

**బైబిల్ క్విజ్ - 26 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

టి.వాణి, ఎన్.జాన్‌పాల్, వి.సుధారాణి, కె.రూప, కోమలి, కొర్నేలీ, స్వరూపారాణి, ఐజాక్‌కుమారి, టి. హేమలత, జి.త్రినాధ్‌రావు, జి.పూజిత, ఎమ్.మాధవి, బి.ఆంధ్ర(నిడదవోలు)

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి - ఏప్రిల్

**భాగ్యలత** : పుష్పలత, రాజేశ్వరి, పద్మ, తిమోతి, మోజెస్, దీపిక, తేజ(మిర్యాలగూడ), పీటర్, ఏలియా, సలోమియ, రూతు, సుజాత, గీత, రాహుల్, హెప్సిబా, యోజస్వి, అభినయశ్రీ, సురేష్, కళ, నాగేష్, ప్రియాంక, పద్మ, కృపారావు, జిన్నిబాబు, ఎలీషాబాబు, కె.ఎల్.నరసింహారావు, జయ, అభిషేక్, విమలాప్రసాద్, నోహ, శేషగిరిరావు, రాజేష్, ఆషా, పర్ణిక, గ్రీష్మ, మధురిమ, జీవన్, కెజియా, నోయాగ్రేస్, శ్రీకాంత్‌రవి, పద్మాకర్, వాత్సల్య, కీనస్విన్

**చింతల్ :** రాజేష్, స్నేహ, శ్రీకాంత్, జయానంద్, బాలరాజు, విజయ్, రాణి, శాంతిప్రియ, రాధామణి, సూర్యదీపిక, శిరీష, సురేంద్ర, హేమకుమారి, జీవన్ కుమార్, విజయ, డేవిడ్, సుధాకర్, మైఖేల్, అనంతరావు, రాజామన్నార్, మోహన్

**అనాజ్‌పూర్ :** ప్రభుదాస్, మరియమ్మ, కరీమున్, ఆనందరావు, ధనలక్ష్మి, శ్రావణి, రమేష్‌బాబు, పీటర్, డేవిడ్, పాల్‌రాజ్, స్వాతి, ఆరాధన, రూతు, కృపావరుణ్

**ఇ.సి.ఐ.యల్ :** లలితా సాల్మన్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



2013 జనవరి, 26 వ తేది - ధనుంజయ గార్డెన్స్, హయత్‌నగర్, హైదరాబాద్‌లో
జరిగిన ఉపవాస ప్రార్థనలో భక్తిశ్రద్ధలతో దేవునిని ఆరాధిస్తున్న సహోదరులు.

2013 జనవరి, 26 వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలో అనేకులు
పాల్గొని దేశం కొరకు ప్రార్థించి, దేవుని ఆరాధించడం జరిగినది.





## ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras